పేదలకు కార్పొరేట్ తరహా వైద్య సేవలు

చిత్తూరు అర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేద ప్రజలకు కార్పొరేట్ తరహా నాణ్యమైన వైద్య సేవలు ప్రజల ఇంటి వద్దనే అందుతున్నాయని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఆయన బుధవారం మేయర్ ఎస్.అముదతో కలిసి చిత్తూరు నగరంలోని 5వ వార్డు సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి పేదల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే పేదలకు కార్పొరేట్ తరహా వైద్య సేవలు అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలుచేస్తున్నట్టు చెప్పారు. అదేవిధంగా ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించుకుంటున్నారని తెలిపారు. అనంతరం వైద్య శిబిరంలో ఏర్పాటు చేసిన పలు విభాగాలను పరిశీలించారు. రోగులకు జగనన్న మెడికల్ కిట్లు పంపిణీ చేశారు. ఐసీడీఎస్, డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సి.హరిణీ రెడ్డి, సహాయ కమిషనర్ గోవర్ధన్, ప్రజారోగ్యశాఖ అధికారి లోకేష్, వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్ టిమ్ స్టీఫెన్ పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

గుడిపాల: ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఆయన బుధవారం 197రామాపురం సచివాలయంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి రోగులను గుర్తించి నాణ్యమైన వైద్యసేవలు అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం జిల్లా అంధత్వ సంస్థ ఆధ్వర్యంలో పలువురికి కంటి అద్దాలు అందజేశారు.


జగనన్న సురక్ష వైద్య కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మేయర్ అముద

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ఏర్పాటుచేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలించారు. ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జనార్ధన్, ఎంపీటీసీ శ్రీదేవి, డాక్టర్లు కీర్తిప్రియ, శ్రీమన్నారాయణ, అనూష, హరి పాల్గొన్నారు.

పేదలకు రక్షణగా జగనన్న సురక్ష

బంగారుపాళెం: ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎంపీపీ అమరావతి అన్నారు. మండలంలోని శెట్టేరి గ్రామంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 250 మందికి డాక్టర్లు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశే లక్ష్యంగా సీఎం జగనన్న పని చేస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ, దేశంలోనే ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజల శ్రేయస్సు కోసం నిరంతరం ఆలోచించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు. అనంతరం వృద్ధులకు వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, రైతువిభాగం రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, నాయకులు అరుణామల్‌రెడ్డి, పాలాక్షిరెడ్డి, మార్కొండ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి, మండల వైద్యాధికారి లోహిత్‌చెంగల్‌రాయన్, వైద్య, అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


బంగారుపాళెం: శెట్టేరి ఆరోగ్య సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీపీ అమరావతి


ఐరాల: వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రజలు

ఐరాలలో..

ఐరాల: ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని, ప్రజారోగ్యానికే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు చేస్తున్నారని స్థానిక సర్పంచ్ తులసిప్రసాద్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. కాణిపాకం పీహెచ్‌సీ పరిధిలోని ఎర్రేపల్లె సచివాలయ ఆవరణలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 474 మందికి స్పెషలిస్ట్ డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దృష్టి లోపం ఉన్నవారికి ఉచితంగా కళ్లజోడు అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్రీనివాస్, పూర్ణలత, చందన, ఎంపీడీఓ నాగరాజు, కొళ్లపల్లె సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.


తవణంపల్లె: జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

తవణంపల్లెలో...

తవణంపల్లె: ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా అన్ని రకాల జబ్బులకు ఉచితంగా వైద్యం అందిస్తోందని ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్ తెలిపారు. బుధవారం మండలంలోని మత్యం గ్రామంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆయన పాల్గొన్నారు. శిబిరంలో డాక్టర్లు సుమారు 365 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పట్నం ప్రతాప్ రెడ్డి, తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి, సర్పంచ్ ఇందిరమ్మ, ఎంపీటీసీ డేవిడ్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక..

అలాగే మండలంలోని ఎగువ తవణంపల్లెలో గురువారం నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపునకు పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు హాజరవుతారని ఎంపీడీఓ తెలిపారు.

క్లుప్తంగా

దుర్గాంబ ఆలయంలో ముగిసిన ఉత్సవాలు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని దుర్గాంబ ఆలయంలో నవరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి అభిషేకం చేశారు. ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం వసంతోత్సవం చేశారు. ఈఓ మునిశేఖర్ ఉభయదారులను సన్మానించి అమ్మవారి ప్రసాదాలు అందజేశారు.

నవంబరు 3 నుంచి పవిత్రోత్సవాలు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని కోదండరామస్వామి ఆలయంలో నవంబరు 3వ తేదీ నుంచి పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్టు అర్చకులు వేణుగోపాల్ తెలిపారు. 3న శతకలశాభిషేకం, 4న అంకుర్పాణ, హోమం, 5న రక్షా బంధనం, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ట, 6న పూర్ణాహుతి, శాత్తుమొర, 7న మహా పూర్ణాహుతి, తిరుమాడ వీధి ఉత్సవం ఉంటాయని పేర్కొన్నారు.

బీజేపీ జిల్లా ఐటీ విభాగం కన్వీనర్‌గా శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్ /తవణంపల్లె: బీజేపీ జిల్లా ఐటీ విభాగం కన్వీనర్‌గా తవణంపల్లెకు చెందిన శ్రీనివాసులు నియమితులయ్యారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు బుధవారం నియామక పత్రాలు అందజేశారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని శ్రీనివాసులు తెలిపారు.

దుర్గాదేవి ఊరేగింపు



పుంగనూరు: పట్టణంలోని నాగపాళ్యంలో మార్వాడీలు ఏర్పాటు చేసిన దుర్గాదేవిని బుధవారం పట్టణంలో ఊరేగించారు. మేళతాళాల నడుమ బాణసంచా పేలుస్తూ కోలాహలంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేసి, అన్నదానం చేశారు.

28న వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ

పలమనేరు/పెద్దపంజాణి: నియోజకవర్గంలోని పెద్దపంజాణిలో ఈనెల 28న తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ, జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్టు నిర్వాహకులు బాగారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే అన్నదానం చేస్తామని, నియోజకవర్గంలోని వాల్మీకి, బోయ కులస్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఐతేపల్లిలో ఏటీఎం కేంద్రం ప్రారంభం

చంద్రగిరి: మండలంలోని ఐతేపల్లెలో బుధవారం ఏటీఎం కేంద్రాన్ని ప్రారంభించారు. గతంలో నగదు కోసం ఐతేపల్లె చుట్టుపక్కల సుమారు 30 గ్రామాల ప్రజలు సుమారు 10 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సివచ్చేది. ఐతేపల్లెలో ఏటీఎం ప్రారంభించడంతో సౌకర్యంగా ఉందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఐతేపల్లెలో ఏర్పాటుచేసిన ఏటీఎంను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకుడు పులిపాటి హేమాద్రి తెలిపారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

చిత్తూరు అర్బన్: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జె.అరుణ పిలుపునిచ్చారు. మిట్టూరులోని మెప్మా ప్రాజెక్ట్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన భరతమాత పట్టణ మహిళా సమాఖ్య కార్యవర్గ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మహిళల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేలా కార్యక్రమాలను అమలు చేయాలన్నారు. మహిళలు ఆర్థికంగా పురోభివృద్ధి సాధించడం ద్వారా కుటుంబం, సమాజం ఆర్థికంగా బలపడతాయన్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో అమలవుతున్న కార్యక్రమాలపై ఆరా తీశారు. 'గుప్పెడు బియ్యం' కార్యక్రమం గురించి తెలుసుకుని అభినందించారు. కార్యక్రమంలో సీఎంఎం గోపి, మెప్మా జిల్లా ఇన్‌చార్జి ఐబీ శ్రీరాములు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

సీసీ రోడ్డు పనుల పరిశీలన

పూతలపట్టు: మండలంలోని తిమ్మిరెడ్డిపల్లిలో సర్పంచ్ చిట్టెమ్మ 15వ ఆర్థికసంఘం నిధులు రూ.3 లక్షలతో గ్రామంలో సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. బుధవారం ఎంపీడీఓ గౌరి నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా నాణ్యతతో రోడ్డు నిర్మించాలని సూచించారు. అనంతరం గ్రామంలో జగనన్న కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడారు. వీలైనంత త్వరగా ఇంటి నిర్మాణాలను పూర్తిచేయాలని సూచించారు. పూర్తి చేయని వారికి బిల్లులు ఖాతాలలో జమకావన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక, ఉపసర్పంచ్ సుబ్రమణ్యంరెడ్డి, నాయకులు నారాయణరెడ్డి, రెడ్డప్పరెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కిషోర్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గౌరి

ఘనంగా మైలేరు పండుగ

బైరెడ్డిపల్లి: మండలంలోని కామినేపల్లెలో బుధవారం మైలేరు పండుగ ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి రైతులు పశువులను అందంగా ముస్తాబు చేసి పరుగుపందెంలో వదిలారు. పశువులకు సినీ నటుల పేర్లు, జంతువుల పేర్లు పెట్టి పందెంలో వదలడంతో యువకులు వాటిని నిలువరించేందుకు నువ్వా, నేనా? అనే లెవెల్లో పోటీ పడ్డారు. విజేతలుగా నిలిచిన పశువులకు సంబంధించి వాటి యజమానులకు బహుమతులు అందజేశారు.


పరుగులు తీస్తున్న పశువులు

నేడు ఎమ్మెల్యే పర్యటన

బంగారుపాళెం: పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు గురువారం బంగారుపాళెం మండలంలో పర్యటించనున్నట్లు మండల కన్వీనర్ రామచంద్రా రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం అరగొండ రోడ్డులోని ఎస్ఎల్‌వీ కల్యాణ మండపంలో నిర్వహించే 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందని, మండలంలోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ఐరాలలో..

ఐరాల: స్థానిక షాదీమహల్‌లో గురువారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి బుధవారం ఓ ప్రకటన వెలువడింది. మధ్యాహ్నం 12 గంటలకు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు కార్యక్రమంలో పాల్గొని ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ డైరెక్టర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలకు దిశనిర్దేశం చేస్తారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు హాజరు కావాలని ప్రకటనలో కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పెద్దపంజాణి: మండలంలోని ముత్తుకూరు పంచాయతీ జంగాలపల్లె గ్రామ సమీప పొలాల్లో బుధవారం ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం..పేకాట ఆడుతున్నారనే ముందస్తు సమాచారంతో ఎస్ఐ తన సిబ్బందితో దాడులు చేశారు. జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.12,040 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

నేటి నుంచి కార్గో వారోత్సవాలు

తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లాలో గురువారం నుంచి నవంబర్ 25వ తేదీ వరకు ఆర్టీసీ కార్గో వారోత్సవాలు నిర్వహించనున్నట్లు డెప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. కార్గో వారోత్సవాల్లో డోర్ డెలివరీపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. 2017 నుంచి కార్గో సేవలు ప్రారంభించామని, రూ.10 కోట్ల రాబడి మొదలైందన్నారు. నేడు రాష్ట్ర వ్యాప్తంగా రూ.169 కోట్ల రాబడి వస్తుందని తెలిపారు. 2021 సెప్టెంబర్ 1 నుంచి డోర్ డెలివరీ చేస్తున్నట్టు చెప్పారు. కార్గో సెంటర్ నుంచి 10 కిలో మీటర్ల వరకు ప్రస్తుతం డోర్‌డెలివరీ చేస్తున్నట్లు చెప్పారు. కార్గో చార్జీలతోపాటు అదనంగా కేజీకి రూ.15, 1-6 కేజీలకు రూ.25, 6-10 కేజీలకు రూ.30, 10-25 కేజీలకు రూ.40, 25-50 కేజీలకు రూ.50 చొప్పున వసూలు చేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడు, కార్గో జిల్లా ఇన్‌చార్జి సురేంద్రబాబు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ఏకాదశి ఉత్సవం

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ ప్రసిద్ధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఏకాదశి ఉత్సవం వేడుకగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరిచి నిత్యపూజా కైంకర్యాలను అర్చకులు పూర్తి చేశారు. ఏకాదశి గడియల్లో అర్చన పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామివారి ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చారు. తదుపరి తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించి నైవేద్య సమర్పణ చేశారు. ఆలయ అధికారి నాగరాజు, భద్రతా జమేదార్ రాజశేఖర్ తదితరులు పర్యవేక్షించారు.

యూకేలోని లీస్టర్ యూనివర్సిటీతో అపోలో ఒప్పందం

- భారత్‌లోనే విదేశీ విద్య అభ్యసించడానికి అంగీకారం
- చిత్తూరులో వివరాలు వెల్లడించిన యూనిట్ హెడ్ నరేష్

చిత్తూరు అర్బన్: భారతదేశంలోనే విదేశీ విద్యను అభ్యసించడానికి చిత్తూరు నగరంలోని అపోలో యూనివర్సిటీ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు బ్రిటన్ (యూకే)లోని లీస్టర్ యూనివర్సిటీలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో అపోలో హాస్పిటల్స్ గ్రూప్ వైస్ చైర్ పర్సన్ ప్రీతా రెడ్డి ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ వివరాలను చిత్తూరులోని అపోలో యూనివర్సిటీలో యూనిట్ హెడ్ నరేష్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. విద్య, వైద్య రంగంలో అంతర్జాతీయ సహకారాన్ని ప్రోత్సహించడానికి, పరిశోధనా కార్యక్రమాలను బలోపేతం చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నట్టు చెప్పారు. విదేశాల్లో డిగ్రీ, బీటెక్ లాంటి విద్యను అభ్యసించడానికి ఇక నుంచి విద్యార్థులు అక్కడికి వెళ్లాల్సిన పనిలేదన్నారు. బ్రిటన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ లీస్టర్(యూవోఎల్) టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్, రీసెర్చ్ ఎక్సలెన్స్ ఫ్రేమ్‌వర్క్‌లో ప్రపంచ వ్యాప్తంగా టాప్ 30 యూనివర్సిటీల్లో ఒకటన్నారు. ఇక్కడ విద్యను అభ్యసించాలనుకున్న విద్యార్థులు ఇక నుంచి యూకేకు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. కోర్సు ఫీజు మొత్తంలో 25 శాతం చెల్లించి చిత్తూరులోని అపోలో యూనివర్సిటీ నుంచే డిగ్రీ చదవే అవకాశం ఉంటుందన్నారు. చివరి ఏడాది మాత్రం యూకేకు వెళ్లాల్సి ఉంటుందని, డిగ్రీ పూర్తవగా లీస్టర్ యూనివర్సిటీ నుంచే పట్టా అందజేస్తామన్నారు. లీస్టర్ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ కనగరాజు నిషాన్‌తో కలిసి అపోలో యూనివర్సిటీ కుదుర్చుకున్న ఒప్పందం ద్వారా విదేశాల్లో టాప్ యూనివర్సిటీల్లో విద్యాభ్యాసం చేయాలనుకున్న యువత కోరిక, భారత్‌లోనే ఉంటూ సాధించుకునే అవకాశం ఉంటుందన్నారు.


యూకేలోని ప్రతినిధులతో అపోలో వైస్ చైర్‌పర్సన్ ప్రీతారెడ్డి

ప్రజారోగ్యమే సీఎం లక్ష్యం

జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: ప్రజారోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజల ముంగిటకే వైద్యసేవలు అందిస్తున్నారని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పునరుద్ఘాటించారు. బుధవారం మండలంలోని చింతమాకులపల్లె సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు చేసి, మందులు ఇవ్వడమే కాకుండా అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా మరింత మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేసి ఉచిత వైద్యం అందిస్తున్నామన్నారు. శిబిరంలో 347 మందికి వైద్యపరీక్షలు చేశారు. వృద్ధులకు కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఎంపీపీ యువరాజు, సర్పంచ్ రామచంద్రప్ప, సచివాలయ కన్వీనర్లు రమేష్, నాగరాజు, డాక్టర్ రాజేష్‌నాయక్, నాయకులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


వృద్ధుడికి కంటి అద్దాలు పెడుతున్న జెడ్పీ చైర్మన్

తిరుచానూరు రైల్వే స్టేషన్ తనిఖీ

తిరుచానూరు(చంద్రగిరి): తిరుపతి ఎంపీ గురుమూర్తి బుధవారం తిరుచానూరు రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేశారు. రైల్వే స్టేషన్‌లో నిర్మాణంలో ఉన్న మొదటి, రెండో ప్లాట్ ఫారాలను కలిపే అండర్ పాస్‌లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అండర్ పాస్‌లలో నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మొదటి ప్లాట్ ఫారంపై నిర్మిస్తున్న క్యాంటీన్, షెల్టర్‌ను పరిశీలించారు. నాణ్యత విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసి జనవరి నెలకు అందుబాటులోకి తీసుకురావాలని రైల్వే అధికారులను కోరారు. ఈ రైల్వే స్టేషన్ అందుబాటులోకి వస్తే తిరుపతి ప్రధాన రైల్వే స్టేషన్‌పై భారం తగ్గుతుందని, తిరుమలకు విచ్చేసే యాత్రికులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. హీరో హోండా షోరూం, సీఆర్ఎస్ వద్ద నిర్మించతలపెట్టిన రైల్వే అండర్ బ్రిడ్జీల టెండర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

వలస కార్మికులకు వరం

ఈ-శ్రమ్ గుర్తింపు కార్డు

- నివాస రాష్ట్రంలో ఉంటే బదిలీకి అవకాశం
- రూ.2 లక్షల ప్రమాద బీమా

పొట్టకూటి కోసం అనేక మంది వలస వెళుతుంటారు. అక్కడ వారు పడే కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఈ క్రమంలో వారికి గుర్తింపు కార్డులు ఇచ్చి అండగా ఉండాలని ప్రభుత్వం సంకల్పించింది. అలాగే ఏదైనా ప్రమాదం జరిగితే వారికి రూ.2 లక్షల బీమా అందజేయనుంది. ఈ మేరకు జిల్లాలో వలస కార్మికుల గుర్తింపు ప్రకియను అధికారులు చేపట్టారు.

–చిత్తూరు కార్పొరేషన్

చిత్తూరు జిల్లాకు ఉపాధి నిమిత్తం తెలంగాణ, ఒడిశా, కర్ణాటక, తమిళనాడు, బీహార్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి కార్మికులు వలస వచ్చి పనులు చేసుకుంటున్నారు. వారి వివరాలను అధికారులు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. తర్వాత వీరికి ఈ-శ్రమ్ గుర్తింపు కార్డు, రేషన్ కార్డు జారీ చేయనున్నారు. శ్రామికుడు ప్రమాదవశాత్తు చనిపోతే ప్రమాద బీమా కింద రూ.2 లక్షల సహాయం చేయనుంది. 16–59 ఏళ్లలోపు వారు దీనికి అర్హులు.

వన్‌నేషన్ –వన్‌రేషన్

సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం అసంఘటితరంగ కార్మికులకు భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ఈ-శ్రమ్ పోర్టల్‌ను ప్రవేశపెట్టింది. ఆధార్ కార్డు తరహాలో దేశంలో ఎక్కడికి వెళ్లినా ప్రయోజనం చేకూరేలా యూఏఎన్(యూనివర్సల్ అకౌంట్ నంబర్)తో కూడిన ఈ-శ్రమ్ గుర్తింపు కార్డును అందజేసే ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తద్వారా వన్ నేషన్ వన్ రేషన్ కింద రేషన్ కార్డులు అందజేయనున్నారు. దీనివల్ల వారు పనిచేసే ప్రాంతంలోనే సులభంగా రేషన్ సరుకులు పొందవచ్చు.


ఒడిశా కార్మికుడికి యూఏఎన్ గుర్తింపు కార్డు అందజేస్తున్న ఓంకార్‌రావు

వీరికి వర్తింపు

భవన నిర్మాణంతోపాటు ఇతర రంగాల్లో పనిచేస్తున్న అసంఘటిత కార్మికులకు ముందుగా ఈ-శ్రమ్ గుర్తింపు కార్డులు ఇవ్వనున్నారు. ముఖ్యంగా తాపీ మేస్త్రీలతో పాటు సెంట్రింగ్, తాపీ కూలీలు, ఐరన్ రాడ్ బెండర్లు, కార్పెంటర్లు, పెయింటింగ్, వెల్డర్లు, శానిటరీ వర్కర్లు, ప్లంబర్, ఎలక్ట్రీషియన్, గుంతలు తీయుట, చదును చేయుట, చెరువులు, బావుల్లో పూడికతీత, బావులు తవ్వడం, నాపరాయి, మార్బుల్స్, గ్రానైట్స్, టైల్స్, మొజాయిక్, ఫ్లోరింగ్ కార్మికులు, పాలిషింగ్ సెంట్రింగ్, సీలింగ్ వర్క్, సున్నం వేయడం, తోపుడు బండ్ల వ్యాపారులు, కోరియర్ బాయ్స్, చేతి వృత్తిదారులు, రోడ్డు నిర్మాణ పనిచేసే వారితో పాటు వివిధ పరిశ్రమలు, కారాగారాల్లో రూ.15 వేలలోపు వేతనం పొందుతున్న కార్మికులు అర్హులు. ఈపీఎఫ్, ఈఎస్ఐ లేని వారికి కూడా ఇది వర్తింపజేశారు.

కావాల్సిన పత్రాలు

వలస కార్మికుడు రేషన్ కార్డు పొందాలంటే ముందుగా ఈ-శ్రమ్ గుర్తింపు కార్డులు తీసుకోవాలి. కార్మికశాఖ పర్యవేక్షణలో నమోదు ప్రక్రియ చేపట్టారు. ఆధార్ లేదా సరైన ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకునే వీలు కల్పించారు. ఏదైనా గుర్తింపు కార్డు, ఫోన్ నంబరు, ఆధార్ కార్డు, కార్మికుడి బ్యాంకు ఖాతా పుస్తకం, ఐఎఫ్ఎస్‌సీ కోడ్, నామిని ఆధార్, బ్యాంక్ ఖాతా జిరాక్స్ కాపీలతో సమీపంలోని సచివాయానికి వెళ్తే ఉచితంగా దరఖాస్తు చేస్తారు.

సద్వినియోగం చేసుకోండి

వలస కార్మికులు ఈ-శ్రమ్ గుర్తింపు కార్డులను తీసుకోవాలి. ప్రమాద బీమా రూ.2 లక్షలు వర్తిస్తుంది. అదే విధంగా రేషన్ సరుకులు పొందవచ్చు. సచివాలయం, మీసేవా కేంద్రాల్లో వివరాలు నమోదు చేసుకోవచ్చు. యూఏఎన్ గుర్తింపు కార్డుల కోసం కార్మికశాఖ కార్యాలయంలో లేబర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశాం. దీని ద్వారా అసంఘటిత రంగ కార్మికులకు గుర్తింపు కార్డులను ఉచితంగా అందజేస్తాం.

– ఓంకార్‌రావు, జిల్లా కార్మికశాఖాధికారి